క్లుప్తంగా

మురుగును పూర్తిగా తొలగించండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: మురుగు కాల్వల్లో మురుగును పూర్తిగా తొలగించి పారుదల జరిగే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని చెంచుపేటలో జరుగుతున్న మురుగు కాల్వల పూడికతీత పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. మురుగు పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మురుగు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీని కోసం రూ.కోటికి పైగా నిధులు వెచ్చించినట్లు చెప్పారు. అనంతరం 25, 29 వార్డులలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన కొల్లిపర తహసీల్దార్



జి.సిద్ధార్థ

కొల్లిపర: మండలం తహసీల్దారుగా జి.సిద్ధార్థ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బుధవారం జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా సిద్ధార్థను కొల్లిపర మండలానికి ఉన్నత అధికారులు బదిలీ చేశారు. సిద్ధార్థ ప్రతిపాడులో తహసీల్దారుగా విధులు నిర్వహిస్తూ ఎన్నికల సమయంలో గిద్దలూరు కి బదిలీపై వెళ్లి అనంతరం సాధారణ బదిలీలో భాగంగా కొల్లిపర మండలానికి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. దీంతో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిద్ధార్థను ఎంపీడీవో విష్ణుప్రసాద్, రెవెన్యూ కార్యాలయ ఉద్యోగులు, మండల పరిషత్ కార్యాలయం ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

రేపు అవగాహన సదస్సులు

తెనాలిరూరల్: నియోజకవర్గంలో గృహాలు, నివేశన స్థలాల మంజూరులో సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఆదివారం అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కార్యాలయవర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఉదయం 9.30 గంటలకు పెదరావూరు లే అవుట్‌లో, మధ్యాహ్నం 3 గంటలకు సిరిపురం లే అవుట్‌లో, సాయంత్రం 5 గంటలకు కొల్లిపర మండలం దావులూరు లేఅవు ట్‌లో సదస్సులు జరుగుతాయన్నారు. పట్టణ పరిధిలోని లబ్ధిదారులు పెదరావూరు, సిరిపురం లే అవుట్‌లలో, కొల్లిపర మండలంలోని లబ్ధిదారులు దావులూరు లేఅవుట్‌లో జరగే సదస్సులకు రావాలని సూచించారు.గృహనిర్మాణ, పురపాలక సంఘ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, విద్యుత్, ఇతర శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



తెనాలిరూరల్: తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తుందని సీడీపీవో సునీత అన్నారు. తల్లిపాల వారోవాల్లో భాగా తెనాలి మండలం కఠెవరం గ్రామంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. సీడీపీవో మాట్లాడుతూ పుట్టిన వెంటనే గంటలోపు బిడ్డకు అందించే ముర్రుపాలు సహజ రోగ నిరోధక శక్తి కలుగచేస్తాయని చెప్పారు. నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు దోహదపడతాయన్నారు. బిడ్డ ఆరోగ్యంగా ఎదగడానికి తల్లిపాలు పోషకాలను అందిస్తాయని చెప్పారు. అపోహలకు పోయి పిల్లలకు తల్లిపాలను దూరం చేయవద్దని సూచించారు.

శుక్రవారం డ్రైడేగా పాటించండి



తెనాలిఅర్బన్: ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మలేరియా శాఖా ఆధ్వర్యంలో చినరావూరు తోటలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వలన దోమల వ్యాప్తి పెరుగుతుందన్నారు. దీనివలన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. తెనాలి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులు అని, చిన్న దోమల వలన ఎక్కువ ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అండే బాలచంద్రమౌళి, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ ఉద్యోగులు, పాల్గొన్నారు.

ఆది నుంచి తలనొప్పి పనులే!

- పదేపదే మరమ్మతులకు గురవుతున్న పైపులైను
- అధికారుల నిర్లక్ష్యం
- ప్రజలకు తప్పని ఇక్కట్లు



రోడ్డు మీదకు వచ్చిన మురుగు



పైపులైను మరమ్మతుల కోసం తవ్విన గొయ్యి

తెనాలిరూరల్: రక్షిత మంచినీటి పథకం పనులు ప్రజలకు ఆది నుంచి తలనొప్పిగా మారాయి. పైపులైన్ల కోసం రోడ్లను తవ్వడం దగ్గర నుంచి ఇళ్లకు ఇచ్చే కుళాయి కనెక్షన్ల వరకు ప్రజలకు అన్నీ కష్టాలే. పథకం కోసం పనులు ప్రారంభించిన తొలి నాళ్లలో పగులగొట్టిన రోడ్లవల్ల ఇప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు. మరమ్మతు పనులలో పర్యవేక్షణా లోపంతో ఇబ్బందులు తప్పడం లేదు. పదేపదే పైపులు లీకవుతుండడంతో రోడ్లు తవ్వాల్సి వస్తోంది. ఇదికాక తాగునీరు విడుదల చేసినప్పుడల్లా రహదారిపై నీళ్లు నిలుస్తున్నాయి.

రక్షిత మంచినీరు సంగతేమో కానీ ప్రజల ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణ మారిస్‌పేట ఆర్‌ఆర్ నగర్‌లోని రాజీవ్‌గృహ కల్ప వద్ద నుంచి 60 అడుగుల రోడ్డు, వెలువోలు వారీ వీధి మీదుగా 21వ వార్డుకు 2022లో పైపులైను వేశారు. ప్రధాన పైపులైను కోసం రోడ్డును పగులగొట్టే సందర్భంలో ఇళ్లకు ఇచ్చే కుళాయి కనెక్షన్‌ల పైపులు తెగిపోయాయి. వీటికి మరమ్మతులు సరిగ్గా చేయించకుండానే కాంక్రీట్‌తో పూడ్చించారు. తాగునీరు సరఫరా చేసే సందర్భంలో ఈ రోడ్డులో నీరు ఫౌంటెన్‌లా ఎగజిమ్ముతోంది. స్థానికులు రాళ్లను అడ్డు పెడుతున్నా రోడ్డంతా నీళ్లు నిలుస్తున్నాయి. ప్రతి రోజు ఉదయం సాయంత్రం నీరు వదులుతుంటారు. ఈ సమయాల్లో 60 అడుగుల రోడ్డు మొత్తం చిత్తడిగా మారుతోంది. బాగున్న రోడ్డును పగులగొట్టడమే కాకుండా సరిగ్గా మరమ్మతులు చేయించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రధాన పైపులైను ఏర్పాటు సందర్భంలోనూ అధికారుల పర్యవేక్షణా లోపం స్పష్టంగా కనబడుతోంది. పైపులైను ఏర్పాటు చేసిన నాటి నుంచి నీరు లీకవుతోంది. వీటి మరమ్మతులనూ పట్టించుకోవడం లేదు. ఇదే రోడ్డులో ప్రైవేటు పాఠశాల ఉంది. అయినా పైపులైను మరమ్మతుల కోసం తవ్విన గుంతలను నెలల తరబడి పూడ్చడం లేదు. సుమారు ఆరు అడుగుల లోతు ఉంటున్న గోతులు నీళ్లతో నిండి ఉంటున్నాయి. ఈ గోతుల వద్ద ఎటువంటి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళల్లో ఇటుగా వచ్చే వారు, చిన్నారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్నా అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అసలు పైపులైను ఏర్పాటు చేసిన నాడే ట్రయల్ రన్ వేసుకుని లీకేజీలను గుర్తించి ఉంటే ఇలా ఇబ్బందులు పడాల్సిన అగత్యం ఉండేది కాదని స్థానికులు చెబుతున్నారు. పర్యవేక్షణా లోపం కారణంగా నెలల తరబడి ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. ఇంతే కాకుండా రక్షిత మంచి నీరు కాల్వలపాలై ఆ మురుగంతా రోడ్డుపైకి చేరుతోంది.

రెండు రోజుల్లో పూర్తి చేస్తాం

ప్రధాన పైపులైనుకు రెండు చోట్ల మరమ్మతులు పూర్తి చేశాం. మరో చోటు చేయాల్సి ఉంది. రెండు రోజుల్లో పనులు పూర్తవుతాయి. పనులను తమ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

–శ్రీనివాసరావు, ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజినీర్

తెనాలిలో రిలయన్స్ డిజిటల్ స్టోర్ ప్రారంభం

ప్రారంభించిన ప్రముఖ సినీనటి హన్సిక



జ్యోతిని వెలిగిస్తున్న సినీనటి హన్సిక

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని పెమ్మసాని థియేటర్ ఎదురుగా రిలయన్స్ డిజిటల్ తన అతి పెద్ద స్టోర్‌ను ప్రారంభించింది. ఈ రిలయన్స్ డిజిటల్ స్టోర్‌ను శుక్రవారం సాయంత్రం ప్రముఖ సినీనటి హన్సిక ప్రారంభించారు. ఆ వెంటనే 'మీట్ అండ్ గ్రీట్'లో పాల్గొని ఎక్స్ క్లూజివ్ సంతకం చేసిన సరుకులను అందుకునే అవకాశాన్నీ కల్పించారు. అతి విశాలంగా 9,300 చదరపు అడుగులతో గ్రౌండ్, 2 అదనపు అంతస్తులతో విస్తరించి ఉన్న ఈ టెక్ గమ్యస్థానం ఉత్తమ ధరలకు అధునాతన ఎలక్ట్రానిక్స్ పరికరాలను అందించటమేనని నిర్వాహకులు తెలియజేశారు. ఇన్-స్టోర్ సహాయం కోసం నిపుణులైన టెక్ స్క్వాడ్, ఎలక్ట్రానిక్స్ కొనుగోలు అనంతర సంరక్షణకు రెస్యూ సేవా నిపుణులు కూడా ఉన్నారని తెలిపారు. వేగవంతమైన డెలివరీ, ఇన్ స్టాలేషన్ తో, వినియోగదారులు ఎలాంటి ఆలస్యం లేకుండా తమకు ఇష్టమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందవచ్చని తెలిపారు. ఎర్లీ బర్డ్ ఆఫర్లతో ప్రముఖ బ్యాంక్ కార్డులపై 10 శాతం వరకు తక్షణ తగ్గింపును అందిస్తున్నామని తెలిపారు.

రిలయన్స్ డిజిటల్ 500కు పైగా అంతర్జాతీయ, జాతీయ బ్రాండ్లకు చెందిన స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ టీవీలు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, హోమ్ థియేటర్లు, డిజిటల్ కెమెరాలు, లాప్‌టాప్‌లు, యాక్సెసరీస్ వంటి 2 వేలకు పైగా ఉత్పత్తులను అందిస్తోందని వివరించారు. 'పర్సనలైజింగ్ టెక్నాలజీ' నినాదానికి అనుగుణంగా, వినియోగదారులకు సరసమైన ధరలలో సాంకేతిక ఎంపికల ప్రపంచాన్ని తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ, ఈజీ ఈఎమ్‌ఐతో సహా బహుళ ఫైనాన్స్ ఎంపికలతో, ప్రతి కస్టమర్ జీవనశైలికి తగిన ఖచ్చితమైన సాంకేతికతను కనుగొనడంలో సహాయపడటం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ



తెనాలిఅర్బన్: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమం శుక్రవారంతో తెనాలి పట్టణంలో ముగిసింది. పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులు పలు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఉండటంతో సచివాలయ ఉద్యోగులు అక్కడకు వెళ్లి వాటిని పంపిణీ చేశారు. చినరావూరుకు చెందిన వై.చిన్న పోతురాజు అనారోగ్యంతో గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అలాగే అదే ప్రాంతానికి చెందిన టి.నాగమల్లేశ్వరి మంగళగిరిలోని ఎన్‌ఆర్‌ఐ వైద్యశాలలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న వెల్ఫేర్ సెక్రటరీ తిరుపతిరావు ఆయా ఆసుపత్రిలకు వెళ్ళి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: రాష్ట్ర ఇమాన్ మజ్లిస్ కమిటీ తెనాలివారి ఆధ్వర్యంలో నరేంద్ర దేవ్ కాలనీలో శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అబ్దుల్, రహమాన్, షేక్ తాజ్ బాషా, షేక్ బాషా, షేక్ బుజ్జి, డి.రాఘవేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో చోరీ

తెనాలిరూరల్: స్థానిక చెంచుపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం ఈద్గా సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో నివసించే వారు తిరుపతి వెళ్లారు. శుక్రవారం ఉదయానికి వీరి ఫ్లాట్ తలుపులు తీసి ఉండడాన్ని గమనించిన అపార్ట్‌మెంట్ వాసులు ఫ్లాట్ యజమానురాలు సుజాతకు సమాచారమందించారు. పోలీసులకు దీనిపై సమాచారం వెళ్లగా ఫ్లాట్‌ను పరిశీలించారు. పెద్ద మొత్తంలో బంగారం, వెండి అపహరణకు గురైనట్టు భావిస్తున్నారు. ఫ్లాట్ యజమానులు వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయని త్రీ టౌన్ ఎస్ఐ నక్కా ప్రకాశరావు తెలిపారు.

'అమ్మకోసం' మొక్కలు నాటిన నాయకులు



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

తెనాలిరూరల్: భారతీయ జనతా పార్టీ తెనాలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో అమ్మకోసం ఒక మొక్క అనే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. స్థానిక కొత్తపేటలోని పాత ప్రభుత్వ వైద్యశాల వెనుక రోడ్డులో ఉదయం జరిగిన కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు అమ్మకోసం ఒక మొక్క కార్యక్రమాన్ని చేపట్టి నాయకులందరూ అక్కడ మొక్కలు నాటారు. సంపత్ రాయుడు మాట్లాడుతూ, అమ్మ మీద ప్రేమ ఉన్నవారందరూ తలా ఒక మొక్క నాటడం వల్ల పర్యావరణం బాగుండి అందరికీ మంచి ఆరోగ్యం ఇస్తుందని అన్నారు. నాటిన మొక్కను చూసినప్పుడల్లా అమ్మను చూసిన భావన కలుగుతుందని చెప్పారు. అలాగే ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, దాదాపు వందకు పైగా ఉన్న షెడ్యూల్డ్ కులాలకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పోరాటం వల్ల అనేక మందికి మేలు చేకూరుతోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలియజేశారు. బీజేపీ సీనియర్ నాయకులు టి.రఘు మాట్లాడుతూ జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్యకు నివాళి అర్పించడంతో పాటు భారతదేశం మొత్తం మొక్కలు నీటి పర్యావరణ హితం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర పథాధికారి గాజుల వెంకయ్యనాయుడు, తెనాలి అసెంబ్లీ కన్వీనర్ కఠారి వాసుదేవ నాయుడు, పట్టణ ఉపాధ్యక్షుడు తుమ్మల సాయి, టి. వెంకటేశ్వరరావు, శిఖా రవీంద్రబాబు, కార్యదర్శి కె. శ్రీనివాస్, కుశల్ రాజ్ జైన్, డి.వీరయ్య, జనసేన నాయకులు పసుపులేటి గోవర్ధన్ బీజేపీ తెనాలి మండల అధ్యక్షుడు నంద కిషోర్ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.

డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జనార్ధనరావు



సీఐ, ఎస్ఐలతో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్ధనరావు

తెనాలిరూరల్: తెనాలి డీఎస్పీగా బి. జనార్ధనరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల జరిగిన డీఎస్పీ బదిలీల్లో భాగంగా తెనాలి సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా జనార్ధనరావు నియమితులయ్యారు. 1995వ బ్యాచ్‌కు చెందిన జనార్ధనరావు ఏలూరు రేంజ్ ఎస్ఐ గా ఎంపిక అయి కృష్ణా జిల్లా పరిధిలో పలు స్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. అనంతరం సీఐగా పదోన్నతి పొంది సీఐడీ విభాగంలో పని చేశారు. 2019లో డీఎస్పీగా పదోన్నతి పొంది అవినీతి నిరోధక శాఖలో (ఏసీబీ) ఇప్పటి వరకూ పని చేశారు. అనంతరం తెనాలి డీఎస్పీగా నియమితులై గత ఏడాది మే 10వ తేదీన బాధ్యతలు చేపట్టి ఈ ఏడాది ఫిబ్రవరి 14 వరకూ తొమ్మిది నెలల పాటు పని చేశారు. ఎన్నికల ముందు జరిగిన బదిలీల్లో భాగంగా విజయవాడ ట్రాఫిక్ డివిజన్-1 ఏసీపీగా నియమితులై ఇప్పటి వరకూ అక్కడ విధులు నిర్వర్తించారు. తాజా బదిలీల్లో భాగంగా ఇక్కడి డీఎస్పీ ఎం. రమేష్ బదిలీ కాగా ఆయన స్థానంలో జనార్ధనరావు తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. విజయవాడ నుంచి వచ్చిన డీఎస్పీ జనార్ధనరావు ముందుగా త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్ బాబుతో కలిసి వైకుంఠపురం క్షేత్రాన్ని సందర్శించారు. శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు డీఎస్పీకి ఘన స్వాగతం పలికారు. స్వామి వారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం సబ్ డివిజనల్ కార్యాలయానికి చేరుకున్న డీఎస్పీకి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు స్టేషన్ల అధికారులు, సిబ్బంది డీఎస్పీ జనార్ధనరావుకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తెనాలి పోలీసు డివిజన్లోని ప్రధాన సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరిస్తానని డీఎస్పీ జనార్ధనరావు తెలియజేశారు. సీఐలు రమేష్ బాబు, టి. వెంకటేశ్వర్లు, ఎస్ఐలు ఎన్. ప్రకాశరావు, ఇ. కోటేశ్వరరావు సహా పలువురు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది డీఎస్పీకి స్వాగతం పలికారు.

9న బ్రాహ్మణ విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



తెనాలి: వేదిక్ బ్రాహ్మణ సేవాసమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన బ్రాహ్మణ విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేయనున్నట్టు సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు అమ్మణ్ణి సుబ్రహ్మణ్యం, తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి చెప్పారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు నాజరుపేటలోని అనుగోలువారి వీధిలో గల విద్యాశంకర భారతీ నృసింహ సదనంలో ఏర్పాటయ్యే సభలో ఈ సేవను నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. ఒకటో తరగతి నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్ వరకు విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ, పరిసర గ్రామాల్లోని బ్రాహ్మణ విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థులు రామలింగేశ్వపేటలోని మూడు బొమ్మల సెంటర్లో గల సమాఖ్య కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వీరితో ఉపాధ్యక్షుడు కుందేటి సుబ్రహ్మణ్యం, కోశాధికారి టి.దక్షిణా మూర్తి, భాగవతుల కామేశ్వరరావు, రావినూతల రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం



అప్పిరెడ్డి, శివకుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ రాధిక. పక్కన మండపాటి

- పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అండగా ఉంటాం
- తెనాలి నియోజకవర్గంలో మళ్లీ జెండా ఎగురుతుంది
- అభినందన సత్కారంలో శాసనమండలి ప్రతిపక్ష నేత లేళ్ల అప్పిరెడ్డి

తెనాలి: రాజకీయాల్లో గెలుపుఓటములు సహజమని, అధైర్య పడకుండా ముందుకు సాగాలని శాసన మండలి ప్రతిపక్ష నేత లేళ్ల అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓడిపోయి ఉండొచ్చని, ప్రజలకు పార్టీ క్యాడర్‌కు ఎప్పుడు ఏ అవసరమొచ్చినా తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నాయకత్వంలో అండగా ఉంటుందని తెలిపారు. శాసన మండలి ప్రతిపక్ష నేతగా నియమితులయ్యాక తొలిసారిగా శుక్రవారం తెనాలి వచ్చిన అప్పిరెడ్డికి స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో పార్టీ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, తండ్రి అన్నాబత్తుని సత్యనారాయణ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని రాజకీయాల్లోకి వచ్చిన శివకుమార్, జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో గత అయిదేళ్లు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికోసం తపన పడ్డారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు, పేదలకు ఇళ్లస్థలాల పంపిణీలో గతంలో ఎవరూ చేయలేనంతగా లబ్ధిని చేకూర్చినట్టు చెప్పారు. క్రమశిక్షణ కలిగిన పార్టీ నాయకులు, క్యాడర్ ఉన్న తెనాలిలో భవిష్యత్‌లో వైఎస్సార్ సీపీ జెండా కచ్చితంగా ఎగిరే పరిస్థితి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటూ పార్టీ అభివృద్ధికి లేళ్ల అప్పిరెడ్డి కృషిచేస్తున్నారని చెప్పారు. ఆయన సేవల్ని గుర్తించి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన శాసనమండలి ప్రతిపక్ష నేతగా ప్రజల వాణిని శాసనమండలిలో వినిపిస్తూ, కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల అమలుకు పోరాటం చేస్తారని ఆశిస్తున్నట్టు చెప్పారు. పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు మండపాటి శేషగిరిరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మున్సిపల్ వైస్‌చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, పార్టీ పట్టణ అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, తెనాలి, కొల్లిపర మండలాల అధ్యక్షులు చెన్నుబోయిన శ్రీనివాసరావు, అవుతు పోతిరెడ్డి, దేసు శ్రీనివాసరావు, కౌన్సిలర్లు మొగల్ అహ్మద్, అవుల కోటయ్య, యాతాటి అనిల్, కొర్ర యశోద, తోట రఘురాం, పెచ్చింగ్ సుభాని, ఎంపీటీసీ సభ్యురాలు దోసపాటి నాగదేవిక, పార్టీ నేతలు బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, తాడిబోయిన రమేష్, కాకి దేవసహాయం, ఏలూరి శేషగిరిరావు, బొంతు నరేంద్రరెడ్డి, కాళిదాసు సత్యనారాయణ, జలగం రామకృష్ణ, మల్లెబోయిన రాము, ప్రసాదం భాస్కరరావు, గోల్డ్ రహిమా, కుర్రా శ్రీను, ఎస్‌ఆర్‌కే శర్మ, సయ్యద్ గౌస్, అన్సారి, కొమ్ము రాయల్, కాళహస్తి భవానీశంకర్, కొల్లా గురునాథగుప్తా, వడ్లమూడి నాని, పినపాటి అనిల్, పెదలంక వెంకటేశ్వర్లు, కోలా వాసు, పెసర్లంక రమణ, వాడపల్లి శివరామకృష్ణప్రసాద్, గైరుబోయిన సుబ్బారావు, మేకల చిరంజీవి, గుర్రం హేమలత, కాళిదాసు వెంకటేశ్వరరావు, అత్తోట చంటి, అక్కిదాసు కిరణ్, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, న్యాయవాదులు కె.ఎం. విల్సన్, గుంటూరు కృష్ణ, చింకా సురేష్, పిల్లి వీరయ్య, యలవర్తి సాంబశివరావు తదితరులు లేళ్ల అప్పిరెడ్డిని సత్కరించినవారిలో ఉన్నారు.

అమ్మకు పుట్టింటి సారె



ఆషాఢ మాసం చివరి వారం సందర్భంగా మండలంలోని కఠెవరం గ్రామంలో గల దుర్గా మల్లేశ్వర స్వామి, దుర్గామాతలకు పుట్టింటి సారెను భక్తులు సమర్పించారు. సారెను శుక్రవారం గ్రామంలో ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయ ధర్మకర్త జాజుల వెంకటేశ్వరరావు, పూజారులు మణికంఠ, వర్మ, జగదీష్ పర్యవేక్షించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

–తెనాలిరూరల్

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత



తెనాలి మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయసునీత

తెనాలిరూరల్: రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డుల్లో రైతుల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం. విజయసునీత చెప్పారు. స్థానిక సుల్తానాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డును శుక్రవారం ఆమె సందర్శించారు. యార్డు అంతటా పర్యటించి అక్కడి పరిస్థితులను పరిశీలన చేశారు. యార్డులో నిమ్మ రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత మాట్లాడుతూ, ఇది రైతు ప్రభుత్వమని, రైతాంగ సంక్షేమం కోసం అనేక పథకాలు తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలోని ప్రతి మార్కెట్ యార్డుని రైతులకు ప్రయోజనకరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. తెనాలి మార్కెట్ యార్డులో రైతులు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను పరిశీలించి దశలవారీగా పరిష్కరిస్తామని తెలియజేశారు. కమిషనర్ విజయ సునీత వెంట విజయవాడ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ సుబ్బారావు, నిమ్మకాయల కమిషన్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు, రైతులు ఉన్నారు.

క్రమశిక్షణతో ఉద్యోగులకు గుర్తింపు

ఫిరంగిపురం: ఉద్యోగ నిర్వహణలో క్రమశిక్షణ కలిగిన వారికి మంచి గుర్తింపు ఉంటుందని... ఏఎస్ఐ మోహన్‌రావు అదే కోవకు చెందుతారని ఎస్ఐ సదాశివరావు అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మోహన్‌రావు పదవీ విరమణ సందర్భంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సదాశివరావు మాట్లాడుతూ బాధ్యతలు నిర్వర్తించిన ప్రతిచోట మాట పడకుండా మోహన్‌రావు పని చేశారని చెప్పారు. అనంతరం మోహన్‌రావు దంపతులను పోలీసు సిబ్బంది శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైటర్ దాసు, ఏఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.